క్లుప్తంగా

బస్సు సౌకర్యం కల్పించాలి

డిపో అధికారులకు గ్రామస్తుల వినతి



డిపో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కేశంపేట: తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామస్తులు, నాయకులు శనివారం షాద్‌నగర్ బస్ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు డిపో మేనేజర్ ఉషను కలిసి తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేని కారణంగా విద్యార్థులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బస్సు సౌకర్యం లేని కారణంగా గ్రామం నుంచి లేమామిడి వరకు కాలినడకన వచ్చి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆరోపించారు. షాద్‌నగర్ డిపో నుంచి ఉదయం, సాయంత్రం వేళలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో డిపో ఎదుట ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉమాపతి, అమేర్, నాగరాజు, శ్రీశైలం, ఖాజాపాషా పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మించాలని వినతి



ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ జాతీయ రహదారి చేగూరు కూడలిలో ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతూ స్థానిక బీజేపీ నేతలు ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేగూరు కూడలిలో ఫ్లైఓవర్ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీంతో స్పందించిన ఎంపీ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ కో–కన్వీనర్ నర్సింహాగౌడ్, నాయకులు రణధీర్‌గౌడ్, మల్లేశ్, విజయభాస్కర్ రెడ్డి, ప్రభాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యను కలిసిన బీసీసేన నాయకులు



ఆర్.కష్ణయ్యను సన్మానిస్తున్న బీసీసేన మహిళా నాయకురాళ్లు

షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను జాతీయ బీసీసేన అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో మహిళా కమిటీ నాయకురాళ్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామీణ స్థాయి నుంచి బీసీసేన కమిటీలను పటిష్టంగా వేసుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలలోని గ్రామాల్లో జాతీయ బీసీసేన మహిళా కమిటీలను పూర్తి చేసినందుకు అధ్యక్షురాలు జక్కుల జలజ, ఉపాధ్యక్షురాలు ప్రవంతిరాజ్‌ను అభినందించారు. బీసీసేన అభివృద్ధికి కష్టపడి పనిచేస్తున్న వారికి త్వరలోనే బీసీసేనలో పెద్ద పదవులు వస్తాయని స్పష్టం చేశారు. అనంతరం బీసీసేన నాయకురాళ్లు ఆర్.కృష్ణయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

షాద్‌నగర్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయం వద్ద 24 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.12లక్షల 28 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రులలో చికిత్స పొందిన తర్వాత సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తూ పేదలకు అండగా నిలుస్తుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

కేశంపేట: రోడ్డును ఆక్రమిస్తూ నిర్మిస్తున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ మండల పరిధిలోని కొత్తపేట శాస్త్రీపురం కాలనీవాసులు శనివారం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. 2వ వార్డులో ఉన్న శాస్త్రీపురం కాలనీకి వచ్చే సీసీరోడ్డును ఆక్రమిస్తూ ఓ వ్యక్తి నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణాల కారణంగా రోడ్డు విస్తీర్ణం తగ్గడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతాయని వారు పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు.

వరుణుడు కరుణిస్తేనే వన మహోత్సవం



వెంకటాపూర్ వన నర్సరీలో పెంచిన మొక్కలు

మొయినాబాద్: గ్రామాలను హరిత వనాలుగా మార్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవానికి వరుణుడు కరుణించడం లేదు. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఒక్కో గ్రామంలో సుమారు 10 వేల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకొని అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ ఇప్పటివరకు వర్షాలు పడకపోవడంతో ఎక్కడా మొక్కలు నాటే కార్యక్రమాలను మొదలు పెట్టలేదు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు..

మొయినాబాద్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 10 వేల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఈ సారి ఆ లక్ష్యం చేరే అవకాశాలు కనిపించడంలేదు. మొక్కల పెంపకంలోనే ఈ సారి కొంతమేర తగ్గినట్లు తెలుస్తోంది. ప్రతి గ్రామంలో 7 నుంచి 8 వేల మొక్కలు వన నర్సరీల్లో పెంచారు. ఈ సారి ఎండలు సైతం ఎక్కువగానే ఉండటంతో మొక్కల పెంపకం కాస్త తగ్గింది. పెంచిన మొక్కలన్నింటినీ గ్రామాల్లో నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. అయితే ఇప్పటికే గత కొన్నేళ్లుగా మొక్కలు నాటుతుండడంతో గ్రామాల్లో ఖాళీ స్థలాలు తక్కువగానే ఉన్నాయి. రోడ్ల పక్కన, చెరువు గట్లు, కాలువ గట్లు, ఖాళీ స్థలాల్లో ఎక్కువ మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మరో వైపు ఇంటి ఆవరణల్లో, వ్యవసాయ పొలాల వద్ద పండ్ల మొక్కల, మల్బరి, వేప, టేకు వంటి మొక్కలు నాటేందుకు ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

వర్షాలు పడగానే..

వన నర్సరీల్లో పెంచిన మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయితే ప్రస్తుతం వర్షాలు పడకపోవడంతో ఈ పరిస్థితుల్లో మొక్కలు నాటితే వాటిని నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. నాటిన మొక్కలకు నీళ్లు అందించాలంటే గ్రామ పంచాయతీలపై భారం పడుతుంది. అందుకే వర్షాలు పడిన తర్వాత మొక్కలు నాటితే భూమిలో తేమ, తడి ఉండి త్వరగా నాటుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమాలను వర్షాలు పడిన తరువాతే మొదలుపెట్టి మొక్కలు నాటాలని నిరీక్షిస్తున్నారు.

గ్రామాల్లో నాటేందుకు మొక్కలు సిద్ధం

- తగిన ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

“ మొక్కలు సిద్ధంగా ఉన్నాయి



మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వన నర్సరీలు ఉన్నాయి. అన్ని నర్సరీల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు సరిపడా మొక్కలు పెంచాం. అన్ని గ్రామాల్లో మొక్కలు ఎక్కడెక్కడ నాటాలో స్థలాలను గుర్తిస్తున్నాం. వర్షాలు పడగానే మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉన్నాం.

– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

నేటి నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీల నిర్వహణకు స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్

షాబాద్: ఈ నెల 29 నుంచి షాబాద్‌లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో ఎస్‌పీఎల్–3 క్రికెట్ క్రీడాపోటీల నిర్వహణకు పార్టీ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏఎంఆర్ ట్రస్టు చైర్మన్ ఎలుగంటి అభిరామ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రికెట్ పోటీలను ప్రారంభించేందుకు క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య, అశోక్, పార్టీ నాయకులు సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్, రాహుల్‌గుప్తా, ప్రభాకర్ రెడ్డి, జానీ, అహమ్మద్, ఆంజనేయులు, సదానందం, సత్యంయాదవ్, సందీప్, రమేశ్ ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

చేవెళ్ల: పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని రాచకొండ ఎస్‌ఓటీ ఏసీపీ అంజయ్య అన్నారు. మండలంలోని కౌకుంట్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం దాత అంజయ్య నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ సారా శివకుమార్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మెగులయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో దాత ఎస్‌ఓటీ ఏసీపీ అంజయ్య

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

ఏడీఏ రమాదేవి



షాద్‌నగర్‌రూరల్: ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఏడీఏ రమాదేవి

షాద్‌నగర్‌రూరల్: రైతులు ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఏడీఏ రమాదేవి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడలోని రైతు జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ పొలంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలనే ఆలోచనతో ప్రభుత్వం రైతులకు సబ్సిడీని అందిస్తుందన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని అధిక లాభాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి హిమబిందు, మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి తేజ్‌కుమార్, మండల ఆయిల్‌పామ్ అధికారి మల్లారెడ్డి పాల్గొన్నారు.

రేగడిచిల్కమర్రిలో..

కొందుర్గు: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి అన్నారు. మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేగడిచిల్కమర్రిలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు వాసవి, లక్ష్మీకాంత్, పామాయిల్ విభాగం ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు



హరీశ్‌రావుతో నాయకులు, ఎన్కేపల్లి రైతులు

మొయినాబాద్‌రూరల్: ఎన్కేపల్లిలో భూములు తీసుకున్న రైతులందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్కేపల్లి గ్రామస్తులతో కలిసి మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని ఆయనను కోరారు. గ్రామంలో గోశాలకు తీసుకుంటున్న భూమిలో ఉన్న రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా కృషి చేయాల్సిన బాధ్యత మనందరిదన్నారు. కార్యక్రమంలో కుమ్మరి రాము, పెండ్యాల శ్రీనివాస్, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: సర్కారు బడుల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సరస్వతి పూజ, విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడులకే పంపించాలని సూచించారు. విద్యే ప్రగతికి మూలాధారమని, అందుకు ప్రతి ఒక్కరూ చదువుకునేలా తల్లిదండ్రులు చూడాలాన్నారు. నిరక్షరాస్యత నిర్మూలన, విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తమవంతు పాలుపంచుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రాథమిక దశనుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని సాధనకు పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, ఏఏపీసీ చైర్‌పర్సన్ సుమతమ్మ, గ్రామస్తులు చెన్నయ్య, రామస్వామి, పాండుగౌడ్, నర్సింహులు, శివ ఉన్నారు.



పాఠశాలలో సరస్వతి మాతకు పూజలు చేస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, టీపీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి అన్నారు. శనివారం మాచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పట్లోల్ల రాంరెడ్డి విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ, గ్రామస్తులు మల్లేశ్, రాజేందర్ ఒక ఫ్యాన్, దేశ నాయకుల ఫొటో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు విరమణ సహజం

ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణలు సహజమని ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతిరెడ్డిగూడ, షాబాద్ బాలికల పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు మిట్ట రవీందర్, రాచ ప్రభాకర్‌రెడ్డికి పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణయ్య, గౌరవ అధ్యక్షులు అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, పీఆర్టీయూ నాయకులు

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి



అవినాశ్‌రెడ్డితో మన్‌మర్రి గ్రామస్తులు

షాబాద్: దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన నివాసంలో మన్‌మర్రి గ్రామస్తులు కలిసి గ్రామంలో శివాలయ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన తనవంతు సాయంగా రూ.2లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పుల్లన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, రాములు, కావలి యాదయ్య, అనంతయ్యగౌడ్, నర్సింలు, వెంకటేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయం, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట భవానిమాత దేవాలయం, నందిగామ మండల పరిధిలోని మామిడిపల్లి రామాలయం అభివృద్ధికి రూ.50లక్షల చొప్పున కోటిన్నర నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా గదులు, గాలిగోపురం, మండపం నిర్మిస్తామన్నారు. భవానిమాత దేవాలయంలో మౌలిక వసతులు, ఆలయ ప్రహరీ నిర్మాణం, రామాలయంలో భక్తులకు అవసరమైన సదుపాయాలను కల్పించనున్నట్లు వెల్లడించారు. దాతలు సహకరించి దేవాలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆలయాల చైర్మన్‌లు, నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, భవానిమాత దేవాలయ చైర్మన్ ముత్యాలరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కావలి శ్రీశైలం, మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, నవీన్‌రెడ్డి, బుడ్డ నర్సింహ, అశోక్, రమేశ్, ఈఓ శివకుమార్, ఏఈ తులసీరాం తదితరులు పాల్గొన్నారు.



ఈఓ శివకుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రెండింటినీ ఒకే భవనంలో నిర్వహించండి

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం–1ను ఇటీవల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రాంభించారు. గ్రామంలోని అంగన్‌వాడీ–2 భవనం సరిగాలేదని, రెండింటినీ కేంద్రం–1 భవనంలోనే కొనసాగించాలని శనివారం చిన్నారుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీడీపీఓ ఉదయ సూపర్‌వైజర్ దివ్యసింగ్‌తో కలిసి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రెండు కేంద్రాలను ఒకే దగ్గర నిర్వహించాలని సీడీపీఓ ఉదయకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన సీడీపీఓ ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే మీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ నిచ్చారు.



సీడీపీఓ ఉదయకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌నాయక్



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌నాయక్ అన్నారు. పట్టణంలో శనివారం వందరోజుల ప్రణాళికలో భాగంగా హనుమాన్‌నగర్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో రోడ్లపై వేసిన చెత్తాచెదారాలను సిబ్బందితో తొలగించి, ఆ స్థలంలో ముగ్గులు వేయించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పట్టణ రోడ్లపై చెత్తాచెదారం వేస్తే చర్యలు తప్పవన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పైపులైన్ లీకేజీ.. రోడ్డంతా జలమయం



పైపులైన్ లీకేజీతో రోడ్డుపై పారుతున్న నీరు

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా శనివారం మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో రోడ్డంతా జలమయమైంది. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పైపులైన్‌కు తరచూ లీకేజీ ఏర్పడుతోందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. మరమ్మత్తులు సరిగా చేసి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం



షాద్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు



మొయినాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



షాబాద్: నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో శనివారం పీవీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు అగ్గనూరు విశ్వం, చెంది తిరుపతిరెడ్డి, జమ్రుద్‌ఖాన్, అందె మోహన్, అనంతం, మురళీమోహన్, ప్రవీణ్, నరేశ్, త్రినాథ్, సందీప్‌గౌడ్, రాజు, దిలీప్, నందిగామ శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు

మొయినాబాద్‌రూరల్: రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు దేశానికి ఎనలేని సేవలు అందించారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొంపల్లి అనంత రెడ్డి, మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి రాము, అంజనేయులుగౌడ్, హరిశంకర్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

షాబాద్: పేద ప్రజలకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలకు పీవీ చేసిన సేవలను కొనియాడారు. పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, పార్టీ నాయకులు సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్ గుప్తా, శ్రీనివాస్, సత్యంయాదవ్, మహమ్మద్ అహ్మద్, జానీ, గౌరీశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, సదానందం, సందీప్ ఉన్నారు.